క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌ను కలిసిన గోపాల్



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన గోరుముచ్చు గోపాల్

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోర్రుముచ్చు గోపాల్ శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిశారు. పార్టీ కోసం పాటుపడే ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు ఇస్తామని, పార్టీ నేతలు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని జగన్ మోహన్‌రెడ్డి సూచించారని గోపాల్ తెలిపారు. రానున్న జెమిలి ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని చెప్పారని వివరించారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

టి.నరసాపురం: మండలంలోని బండివారి గూడెం పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణాలకు సర్పంచ్ నాళం శిరీష శుక్రవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ పరిధిలోని ఆరు రోడ్లను రూ.30 లక్షలతో నిర్మించనున్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ మృతి

చింతలపూడి: టీడీపీ చింతలపూడి అధ్యక్షుడు పక్కాల వెంకటేశ్వర్రావు(70) రోడ్డు ప్రమాదానికి గురై విజయవాడలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. వెంకటేశ్వర్రావుకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటేశ్వరరావు ఏఎస్సైగా పని చేస్తూ 2012లో ధర్మాజీగూడెంలో పదవీ విరమణ చేశారు. ఆయన మృతికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, సీపీఐ, సీపీఎం నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

సరిపల్లిలో డ్రై డే



సరిపల్లిలో పరిసరాలను పరిశీలిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మండలంలోని సరిపల్లి గ్రామంలో డ్రై డే, ఫ్రై డే కార్యక్రమం శుక్రవారం బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు గుడ్లు పెట్టి వృద్ధి చెందుతాయని, తద్వారా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా వస్తాయని హెచ్చరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వాడి పడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డిస్పోజబుల్ గ్లాసులు, పాత టైర్లు, పగిలిన, వాడని కుండలను తొలగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్‌కే చాన్‌బాషా, కె.గంగాదేవి, పి.జయప్రద, ఎం విమలదేవి, ఆశ కార్యకర్తలు కె.వెంకటలక్ష్మి, ఎం వరలక్ష్మి, డి.సీత, వి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా



కుక్కునూరులో శుక్రవారం ఉదయం ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తున్న దృశ్యం

కుక్కునూరు: ట్రాక్టర్‌లలో, ఎడ్ల బండ్లలో ఇసుకను తరలించినా అడ్డుకోవద్దని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ఆసరాగా చేసుకుని అధికార పార్టీ నాయకులు కుక్కునూరు సమీపంలోని గుండేటి వాగు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. గురువారం రాత్రి వాగులో జేసీబీని ఏర్పాటు చేసి ట్రాక్టర్‌ల ద్వారా ఇసుకను కివ్వాక తరలించి అమ్ముకున్నట్లు తెలుస్తోంది. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ప్రభుత్వం 20 టన్నులకు రూ.4 వేలు వసూలు చేస్తుంటే, సామాన్యుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక ధరకు అమ్ముకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై కుక్కునూరు తహసీల్దార్ రమేష్ బాబును వివరణ కోరగా, ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం తెలిసిన వెంటనే సిబ్బందిని పంపామన్నారు. అధికారికంగా జీవో కాపీ అందేంత వరకు గుండేటి వాగువద్ద ఇసుకను అక్రమంగా తరలించకుండా సిబ్బందికి డ్యూటీలు వేస్తున్నట్లు తెలిపారు.

ఆదివాసీ గ్రామాలను అభివృద్ధి చేయాలి

కుక్కునూరు: అడవి బిడ్డల బతుకులు చీకట్లో మగ్గుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య పేర్కొన్నారు. శుక్రవారం బరపతినగర్‌లో శాఖ కార్యదర్శి సోడె నగేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆదివాసీలకు వైద్యం, ఇతర సౌకర్యాలు అరకొరగానే అందిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ గ్రామాలను అభివృద్ధి చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని ఆయన పాలకులను డిమాండ్ చేశారు. మండల నాయకులు మైసాక్షి వెంకటాచారి, రమణరాజు, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం భయానకం

- వర్షాలకు చిత్తడిగా మారిన ప్రధాన, గ్రామీణ రోడ్లు
- చింతలపూడి నియోజకవర్గంలో ప్రజలకు అవస్థలు

చింతలపూడి : ఏమాత్రం ఆదమరిచినా ఆసుపత్రి పాలు కావాలసిందే. చింతలపూడి నియోజకవర్గంలోని పలు ప్రధాన రహదారులు గోతులు ఏర్పడి వర్షపు నీటితో ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. మెట్ట ప్రాంతంలో భారీ వర్షాలకు రోడ్లు భయానకంగా మారాయి. అల్ప పీడనాల ప్రభావంతో కురుస్తోన్న వానలకు రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. ప్రధాన, గ్రామీణ రోడ్లు చిత్తడి, చిత్తడిగా తయారవుతున్నాయి. సకాలంలో రోడ్ల మరమ్మతులు చేపడితే ఈ దుస్థితి ఉండేది కాదని గ్రామస్తులు వాపోతున్నారు. చింతలపూడి నియోజకవర్గం భట్టువారిగూడెం, బాలువారిగూడెం, సీతానగరం, నామవరం, జీలకర్రగూడెం, టీనరసాపురం రోడ్డు, కామవరపుకోట – జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారి, చింతలపూడి మెయిన్ రోడ్డుతో సహా అన్ని రోడ్లపైనా గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వర్షం పడిందంటే రోడ్లు మురుగు గుంటలుగా మారిపోతున్నాయి. వర్షపు నీటితో నిండిన గోతులు కనపడక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఏలూరు – చింతలపూడి, రేచర్ల, యర్రగుంటపల్లి సమీపంలో రోడ్లు మరితం దారుణంగా మారాయి. వెంటనే అధికారులు స్పందించి రహదారుల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన తాడువాయి, చల్లావారిగూడెం పునరావాస కాలనీ రోడ్డు



ధ్వంసమైన జంగారెడ్డిగూడెం - ఏలూరు రోడ్డు



చింతలపూడి, కామవరపుకోట ప్రధాన రహదారి ఇలా..



కామవరపుకోట మండలం ఉప్పలపాడు సమీపంలో రోడ్డు దుస్థితి

శంకుస్థాపన సరే.. పనుల ప్రారంభం ఎప్పుడో

రోడ్ల దుస్థితిని చూసి ఆర్టీసీ బస్సులు నడపడానికి అటు సత్తుపల్లి, ఇటు జంగారెడ్డిగూడెం, ఏలూరు డిపోలకు చెందిన డ్రైవర్లు విముఖత వ్యక్తం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నామవరం, పట్టాయిగూడెం రహదారి నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడం లేదని విమర్శలు వస్తున్నాయి.

మరమ్మతులు చేపట్టాలి



మండలంలో రోడ్లు గోతులు పడి అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం నరక ప్రాయంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. వెంటనే మరమ్మతులు చేపట్టాలి. రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి.

– సీహెచ్ జ్ఞానారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లు అందుకున్న విజేతలు

చింతలపూడి: ఏలూరు జిల్లా సెట్‌వెల్, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గురువారం థిమిటిక్, సాంస్కృతిక అంశాలపై నిర్వహించిన పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. జానపద నృత్యాల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ, తెలుగు సాహిత్యానికి సంబంధించిన కవితల్లో ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు విజేతలను అభినందించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో మెరుగైన క్రీడాకారులు ఉన్నారని, వీరికి సరైన శిక్షణ ఇప్పిస్తే జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తారని ప్రిన్సిపాల్ అభిప్రాయపడ్డారు. విద్యార్థులు రాణించేందుకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

రోడ్డు పనులు పటిష్టంగా చేపట్టాలి

కుక్కునూరు: కుక్కునూరు నుంచి బూర్గుంపాడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణ పనులు పటిష్టంగా చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో అవసరం ఉన్నచోట కల్వర్టులు నిర్మించాలని, అల్లిగూడెం ప్రాంతంలో నర్సరీల్లో వాడిన నీరు రోడ్డుపైకి రాకుండా డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని, పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డు అక్రమణలు తొలగించాలని చేయాలని కోరారు.

మట్టి, ఇసుకతో కూటమి నేతలకు కాసులు

- ఉచితం అంటూనే ప్రజలపై పెనుభారం
- మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: కూటమి నేతలకు మట్టి, ఇసుక కాసులు కురిపిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పే ఉచిత ఇసుక ఎక్కడా లభించడంలేదని ఆరోపించారు. రాత్రి వేళల్లో కూటమి నాయకులే యథేచ్ఛగా ట్రాక్టర్లలో మట్టి, ఇసుక తోలుకుంటూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని వివరించారు. ఇసుక, మట్టి అక్రమ రవాణాపై రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. కుక్కునూరు మండలంలోని కూటమి నేతలు యథేచ్ఛగా ఇసుక, మట్టి రవాణాకు పాల్పడుతున్నారని విమర్శించారు. బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లో కూడా రాత్రి వేళల్లో అక్రమ రవాణాను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇసుక కొరత లేకుండా తక్కువ ధరలకే సరఫరా చేశామని గుర్తు చేశారు. ఉచితం పేరుతో ప్రస్తుత ప్రభుత్వం ఇసుక అందకుండా చేయడం వల్లే కార్మిక కుటుంబాలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ప్రజలకు ఇసుక ఉచితంగా అందేలా కృషి చేయాలని కోరారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



బుట్టాయగూడెం సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పానే పేదలపై పెనుభారం మోపడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆ పార్టీ నాయకులు స్థానిక సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ట్రూ అఫ్ చార్జీల పేరుతో పేదలపై భారాలు మోపడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం సర్దుబాటు చార్జీల విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పేదలపై విద్యుత్ భారం మోపితే 2000వ సంవత్సరం నాటి విద్యుత్ ఉద్యమం పునరావృతం అవుతుందని ఆయన హెచ్చరించారు. అనంతరం ఒక వినతిపత్రాన్ని విద్యుత్ సబ్ స్టేషన్‌లో సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు పి.రామకృష్ణ, ముత్యాలమ్మ, ఎ.ఫ్రాన్సిస్, పోలోజు నాగేశ్వరరావు, ఉడతా వెంకటేష్, చుండ్రు బుల్లెమ్మ, వెట్టి వీరయ్య, కె.భాస్కర్, టి.వెంకటలక్ష్మి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

కొయ్యలగూడెం: ట్రూఅఫ్ సర్దుబాటు విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ సీపీఎం మండలం కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం కొయ్యలగూడెం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు తమ ప్రభుత్వం వస్తే చార్జీలు పెంచమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మోటర్లకి మీటర్లు బిగిస్తూ చిన్న సన్నా రైతులకు భారం పెంచిందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు ఇంటింటికీ పెట్టటానికి సిద్ధం చేస్తుందన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏఈకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ శివకుమార్, మర్రి త్రిమూర్తులు, మర్రి సుబ్రహ్మణ్యం, ఉద్దాటి వెంకన్న గోపి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తడికలపూడి విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కామవరపుకోట: రాష్ట్రస్థాయి పుట్ బాల్, సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలకు తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్టు ప్రధానోపాధ్యాయులు అంగులూరి సర్వేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల దేవరపల్లి మండలం పల్లంట్ల హైస్కూల్‌లో, పెదవేగి మండలం ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో పుట్ బాల్‌లో మేడూరి పూర్ణ నాగ శివ సాయి, సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీల్లో దామర్ల కృష్ణసాయి, నాగ సాయి, అండర్-17 విభాగంలో సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీల్లో సోడిమెల్ల రాజశేఖర్, వెన్నెల హేమంబర వాసు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మారగాని నరసింహరాజును జెడ్పీటీసీ కడిమి రమేష్, సర్పంచ్ కొత్తపల్లి శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ కొండపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థుల ప్రతిభ గుర్తింపే లక్ష్యం



చెకుముకి విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: పాఠశాల స్థాయిలో విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు బుద్దుల లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి గుర్రం గంగాధరరావులు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో రాజానగరం హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, పాలకుంట హైస్కూల్ ద్వితీయ, బుట్టాయగూడెం హైస్కూల్ తృతీయ స్థానాల్లో నిలిచాయని వివరించారు. విజేతలకు సర్టిఫికెట్‌లను అందజేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల లెక్చరర్ సురేష్, స్టాఫ్ సెక్రటరీ రాజుదొర, ఉపాధ్యాయులు గణేష్, మురళి, రాంబాబు, చంద్రకళ, కనకదుర్గ పాల్గొన్నారు.

రీసర్వే సమస్యల పరిష్కారానికి కృషి



వింజరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

పోలవరం రూరల్: భూముల రీసర్వే విషయంలో రైతులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యలకు త్వరలో పరిష్కారం చూపుతామని తహసీల్దార్ ఆర్ఎస్ రాజు అన్నారు. పోలవరం మండలం వింజరం గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో గతంలో రీ సర్వే పూర్తయిన భూములకు సంబంధించి కొన్ని సమస్యలను రైతులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గిరిజనులు సాగులో ఉన్న భూములకు సంబంధించి సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ కంభంపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

చింతలపూడి : గ్రామ సభల ద్వారా భూసమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ డి.ప్రమద్వర తెలిపారు. మండలంలోని గొన్నేపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో భూ కొలతల కోసం 5, మ్యూటేషన్ కోసం 2, దారి సమస్య పరిష్కారం కోరుతూ ఒక దరఖాస్తు వచ్చిందని, వీటిని పరిశీలించి ఉన్నతాధికారుల సూచనల మేరకు పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ డీటీగా వెంకటేశ్వరరావు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సివిల్ సప్లయిస్ డీటీగా జి.వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీటీ లక్ష్మి బదిలీ అయ్యారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం ఎంఎల్ఎస్ గొడౌన్ ఇన్‌చార్జిగా పనిచేస్తూ వెంకటేశ్వరరావు ఇక్కడికి వచ్చారు. ఆయన్ని రేషన్ డీలర్ల నాయకులు, తదితరులు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

మోటారు సైకిళ్లపై చలానా తనిఖీలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మోటారు సైకిళ్లపై పాత చలానాలు వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టామని ట్రాఫిక్ ఎస్సై టీఎస్ రంగారావు తెలిపారు. శుక్రవారం నగరంలో మోటారు సైకిళ్ల చలానాలను తనిఖీ చేశారు. 13 కేసుల్లో రూ.3620 కట్టించామని రంగారావు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలకు చలానాలు వేస్తామని, వెంటనే చెల్లించాలని కోరారు.

ఒకే వేదికపై మూడు కల్యాణాల మహోత్సవం



కల్యాణ మహోత్సవం ఆహ్వాన పత్రికను విడుదల చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: కొయ్యలగూడెం మండలం సీతంపేటలోని రాజరాజేశ్వరి త్రిశక్తి పీఠం వారు నవంబర్ 18న శ్రీనివాస శివ కార్తికేయ కల్యాణ మహోత్సవం స్థానిక నూకాలమ్మ ఆలయంలో నిర్వహించనున్నట్టు నూకాలమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు యరమ్రిల్లి సాయి నరసింహ మనోజ్ శర్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కరపత్రాలను విడుదల చేశారు. ఒకే ముహూర్తం, ఒకే వేదిక, మూడు దివ్యకళ్యాణాలు జరగడం శుభపరిణామం మనోజ్ శర్మ అన్నారు. రాజాన సత్యనారాయణ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠ ప్రతినిధి ఈమని శశి కుమార్ శర్మ మాట్లాడుతూ ఒకే వేదిక పై మూడు కళ్యాణాలు ఏకకాలంలో నిర్వహించడం అరుదని, భక్తులందరూ పాల్గొని తరించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, మాజీ చైర్‌పర్సన్ బంగారు శివలక్ష్మి, పాలపర్తి శ్రీనివాస్, చిన్ని రామసత్యనారాయణ, చిన్ని హరీష్, కందులపాటి సురేష్, కనుపర్తి ధనకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలు వీరే



బహుమతులు అందుకున్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఎంవీ శ్యాంబాబు, టి.జేమ్స్ బాబు నిర్వహించారు. ఈ టెస్ట్‌లో తిరుమలాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎం మునిచరణ్, ఎం జశ్వంత్, యు.వెంకట్ రేవంత్ జట్టు ప్రథమ, జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ద్వితీయ, వేగవరం జెడ్పీ హైస్కూల్ తృతీయ స్థానాల్లో నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ప్రతిభ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రథమ, విద్యావికాస్ హైస్కూల్ ద్వితీయ, బడ్స్ అండ్ బ్లోజమ్స్ పాఠశాల తృతీయ స్థానాల్లో నిలిచాయన్నారు. విజేతలకు ఎంఈఓ-2 బి.రాములు, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కేఎస్‌వీ లోవకుమారిలు బహుమతి ప్రదానం, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతి పౌరుడూ సైన్స్ ప్రచారంలో భాగస్వాములు కావాలని, అందుకు కృషి చేస్తున్న జనవిజ్ఞాన వేదిక సంస్థను కార్యకర్తలను ఎంఈఓ-2 బి.రాములు అభినందించారు.

పీడీఎస్‌యూ ఉత్సవాలను విజయవంతం చేయండి



పీడీఎస్‌యూ ఉత్సవాల వాల్ పోస్టర్ విడుదల చేసిన నాయకులు

పోలవరం రూరల్: పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఆయన విడుదల చేశారు. 1972వ సంవత్సరంలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి జార్జి రెడ్డి హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో పీడీఎస్‌యూని ఏర్పాటుచేశారని తెలిపారు. ప్రశ్నించే వ్యక్తిత్వం నచ్చని కొందరు రౌడీ మూకలు, మతోన్మాద శక్తులు జార్జి రెడ్డిని హత్య చేశారని, ఆయన ఆశయాలతో పీడీఎస్‌యూ పోరాడుతోందని చెప్పారు. అర్ధ శతాబ్ది ఉత్సవాలను హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో అక్టోబర్ 24న, ఆంధ్రప్రదేశ్ విజయవాడ ఎంబీబీకే భవన్‌లో నవంబర్ 5న ఘనంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జి.సుబ్రహ్మణ్యం, ఎం.రాజు, జి.కళ్యాణ్, కె.అమర్నాథ్, ఎం.రాంప్రసాద్, జె.హర్ష కుమార్, వై.కళ్యాణ్‌రామ్, కె.అంజిబాబు, ఎం.గణేష్, వి.సంజయ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.